## క్రైం కథ

# దొంగ...

**సరసి**

సీతకి నూటైదు జ్వరం. రాత్రంతా దగ్గుతూనే వుంది. ఓ రాత్రి వేళ ఆమెకు దగ్గు ఎక్కువైతే లేచి రెండు చెంచాల 'కాఫ్ సిరప్' ఇచ్చి. గుండెల దాకా దుప్పటి కప్పి, పడుకోమని చెప్పి, అలా ముందు గదిలోకొచ్చి యధాలాపంగా కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ నిలుచున్నా.



పగలంతా రణగొణ ధ్వనులు, ఆర్తనాదాలు చేసి అలసిపోయిన ప్రపంచం స్తబ్దుగా అలా నిద్రపోతూ వుంటే చూడడం నాకిష్టం. కొద్ది సేపు అలా నిలబడ్డాను.

ఎవరో ఓ వ్యక్తి మెల్లగా నడుస్తూ ముందుకెళ్లి, మళ్లీ వెనక్కి వచ్చి ఎదురింటి ముందు ఆగేడు. అతని ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించి నాకు. వీధి దీపం వెలుగులో కాస్త స్పష్టంగానే కనిపిస్తున్నాడు. ఒక్క క్షణం అటూ ఇటూ చూసి వాళ్ల పిట్టగోడెక్కి లోపలకి దూకేడు. నా గుండె ఝల్లుమంది. దొంగలనెప్పుడూ అలా ప్రత్యక్షంగా యాక్షన్‌లో చూడలేదు నేను. త్వరగా లోపలకొచ్చి సీతకి చెప్పాను. ఏం చెయ్యాలి? ఇద్దరికీ కంగారుగానే వుంది.

ఆ ఇంటి యజమానికి ఫోన్ చేస్తే? బాగానే వుంటుందంది సీత. వెంటనే టెలిఫోన్ బుక్ తీసి నెంబరు చూసి విఠల్‌రావు గారికి ఫోన్ చేశా. బహుశా గాఢ నిద్రలో వున్నారేమో... నాలుగైదురింగులకి గాని ఫోన్ తియ్యలేదు. వాళ్లావిడ రంజని గారు "హలో" అంది. నేను ఫలానా అని చెప్పుకొని, వాళ్ల కాంపౌండులోకి మనిషి దూకిన సంగతి చెప్పి, విఠల్‌రావుగారిని పిలవమన్నాను లైన్లోకి. ఆయన క్యాంపుకెళ్లాడట. ఆమె ఒక్కతే వుంది. నేను విషయం చెప్పగానే భయపడిపోయింది. "దేవుడా...దేవుడా" అంటూ ఏడుపు లంకించుకుంది. ఫరవాలేదంటూ ధైర్యం చెప్పి, నేను వెంటనే వస్తున్నానన్నాను. అందాకా తలుపు తియ్యవద్దని, చప్పుడు చెయ్యవద్దని కూడా చెప్పాను. సాహసం చేసి, ఎలాగైనా దొంగని పట్టుకోవాలని నాకు ఆరాటంగా వుంది.

తీరా ప్యాంటు వేసుకని బయల్దేరబోతూ వుంటే సీత అంది. "ఆమె భర్త ఊళ్లో లేనప్పుడు మీరు వొంటరిగా వెళ్లడం బావుండదు. ఇంకెవరినైనా తోడు తీసుకెళ్లండి" అని. నిజమేననిపించి, టెలిఫోన్ బుక్ దగ్గర పెట్టుకొని పక్కింటి ఏలేశ్వర్రావుకి ఫోన్ చేశా.

"మా ఆఫీసులో ఆడిట్ అవుతోందండీ. ఇప్పుడే వచ్చి నడుం వాల్చా. సారీ, సత్యనారాయణ గారిని తీసుకెళ్లండి" అని ఫోన్ పెట్టేశాడాయన. సత్యనారాయణగారికి చేశా. నంబరు మారిందో ఏమో, "ప్రస్తుతం ఈ ఫోన్ మనుగడలో లేదు" అని సమాధానం వచ్చింది. "బుచ్చిబాబు గారికి డయల్ చేస్తే " వయార్యు టేకింగ్ రిస్క్? రేపు చూద్దాం. నథింగ్ విల్ హేపెన్ గుడ్‌నైట్." అన్నాడాయన. ఆశ్చర్యపోలేదు నేను. కాలనీలో కలిసిరాని వాళ్లే ఎక్కువ. ఏం చెయ్యాలి? ఒక పక్క ఆలస్యం అయిపోతోంది.

పక్కనే కూర్చున్న సీతకి పరిస్థితి అర్థమైనోయింది. "లాభం లేదు నేనొస్తా పదండి." అంటూ లేచి మంచం మీది దుప్పటి శాలువాలా కప్పుకుని బయల్దేరింది. ఆమె నీరసంగా వున్నా అప్పటి నా పరిస్థితిలో కాదనలేకపోయాను. టార్చి లైటు, చేతి కర్ర తీసుకొని బయటకొచ్చి తలుపు తాళం వేశాం.

ఎదురింటికి చేరి కాలింగ్ బెల్ కొట్టేను. రంజని గారు కిటికీ తెరిచి, మేమే అని నిర్ధారించుకొన్నాక తలుపు తీసింది. అప్పటికే ఆమె జ్వరం వచ్చినట్లు వణికిపోతోంది. వళ్లంతా చెమటలు. మెల్లగా ధైర్యం చెప్పి నేనొక్కడినే టార్చి తీసుకొని ఇంటి కాంపౌండ్ లోపల చుట్టూ తిరిగేను ధైర్యం చేసి, వాడెక్కడైనా వుండి దాడి చేస్తే కొట్టడానికి కర్రని పొజిషన్‌లో పట్టుకున్నా. మరో వ్యక్తి సాయం వుంటే పట్టుకోవడానికి ప్రయత్నించి వుండే వాడిని. ఇప్పుడే నేనొక్కడినే వాడినే పట్టుకోగలనా? గుండె వేగంగా కొట్టుకుంటోంది. వెనకాల కార్ షెడ్ వుంది. దానికి తాళం వేసుంది. దాని పక్కన గాని నక్కేడా? అక్కడా లేదు. వాడు నక్కే అవకాశం వుంటుందనుకొన్న చోటల్లా కర్రతో అదిలించి చూశాను. ఎక్కడా లేడు. పక్క ఇళ్ల కాంపౌండు వాల్సు అన్నీ ఆనుకుని వున్నాయి. అందువల్ల తప్పించుకొని పారిపోవడానికి ఏ మాత్రం కష్టం లేదు.

ఆమె ఒక్కతే వుంది. నేను విషయం చెప్పగానే భయపడిపోయింది. "దేవుడా...దేవుడా" అంటూ ఏడుపు లంకించుకుంది. ఫరవాలేదంటూ ధైర్యం చెప్పి, నేను వెంటనే వస్తున్నానన్నాను. అందాకా తలుపు తియ్యవద్దని, చప్పుడు చెయ్యవద్దని కూడా చెప్పాను. సాహసం చేసి, ఎలాగైనా దొంగని పట్టుకోవాలని నాకు ఆరాటంగా వుంది.

ఆ మాటే రంజని గారికి చెప్పేను. ఆమె దేవుళ్లందరికీ దణ్ణేలు పెడుతూ వేడుకుంటోంది. "ఈయన క్యాంపులుజ్జోగం కాదు గానీ, నా చావుకొచ్చిందన్నయ్యగారూ. చీకటి పడితే చాలు నా ప్రాణాలిలా వుంటున్నాయి." అంటూ రాగాలాపన ప్రారంభించింది.

"సీతకి జ్వరం. లేకపోతే మీకు సాయంగా పడుకునేదీపూట. అయినా ఫర్వాలేదు. ఏదైనా చప్పుడైతే నాకు ఫోన్ చెయ్యండి." అని చెప్పి, ఆమె తలుపు వేసుకున్నాక, మేమిద్దరం గేటు వేసి, ఇంటికి చేరుకున్నాం.

"అత్తగారిని సాయం తెచ్చుకోవచ్చు. అసలావిడంటేనే గిట్టదీమెకు" అంది సీత పక్కెక్కుతూ. ఈ హడావుడిలో సీతకి దగ్గు తగ్గింది. మళ్లీ గుర్తు చేస్తే ఎక్కడ దగ్గుతుందోనని, దుప్పటీ కప్పి పడుకోమన్నాను. నేను కూడా నడుం వాల్చేను. గానీ చాలా సేపటికి వరకూ నిద్ర పట్టలేదు. మగత నిద్రలో నేనా దొంగని తరుముతున్నట్లు, వాడు పరిగెడుతున్నట్లు, ఇద్దరం కలబడినట్లు ఏవేవో కలలు!

ఎప్పుడో మెళకువ వచ్చింది. సీతకి డిస్టబెన్సు కాకుండా మెల్లగా లేచి, లైటేసి చూశా. టైము నాలుగూ పది. లైటార్పి వీధి గదిలో కెళ్లి కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాను. 'దొంగ మళ్లీ వస్తాడా? అని మనసులో ప్రశ్న. వెంటనే మళ్లీ ఎందుకు వస్తాడు' అని సమాధానం. కొద్ది సేపు అలా నిలబడి ఇక ఏ అలికిడీ లేదనుకుని, వచ్చి పడుకుందామనుకుంటూ వుండగా ఎదురింటి తలుపు తెరుచుకుంది. ఆత్రంగాచూశా.

రంజని గారు బయటకు వచ్చి గుమ్మంలో నిలబడింది. 'అరె! ఈమె ధైర్యంగా తలుపెందుకు తీసింది?' అనుకుంటూ వుండగా, ఆమె వెనక నించి ఒక వ్యక్తి బయటకువచ్చాడు ఆశ్చర్యం! వాడు రాత్రి నేను చూసిన దొంగే!

నేను ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపు, వాడు ఆమెకు చెయ్యి ఊపి మెల్లగా గోడ దూకి వీధిలో నడుచుకుంటూ వెళ్లిపోయాడు. ఆమె తలుపేసుకుంది.

★